భరత్‌నగర్‌కాలనీ జనరల్ బాడీ సమావేశం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ జనరల్ బాడీ సమావేశాన్ని అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈనెల 30 లోగా కాలనీ సంక్షేమ సంఘం సభ్యత్వం తీసుకోవాలని, త్వరలోనే కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఉంటాయని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్. పి. నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షపతి నేత, అడహక్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూజలు



కూకట్‌పల్లి: శ్రీశైలంలోని భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామివారి ఆలయాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ రోడ్డు నంబర్ 8 నుంచి 11 వరకు సుమారు రూ. 30 లక్షల వ్యయంతో తలపెట్టిన సీసీ రోడ్డు పనులను అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెవ్వూరు మధుసూదన్‌రావు, కన్వీనర్ రోణంకి జగన్నాథం, చైర్మన్ తుంగం శ్రీనివాసరావు, కోశాధికారి గుత్తికొండ రామకృష్ణ, ముఖ్య సలహాదారులు చిలకల సాయన్న, సుందర శేషరావు, ఈదరాడ సత్యనారాయణ, పిల్లి అశోక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసే చేరికలు



కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కైసర్‌నగర్‌కు చెందిన శేఖర్, రాజు ఆధ్వర్యంలో పలువురు ఆదివారం పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడినవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, బోయిని వెంకటేశ్, మాజీ వార్డు మెంబర్ శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షుడు ఎండీ. లాయక్, గణేశ్ తదితరులు ఉన్నారు.

25న జాబ్‌మేళా

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని కె.ఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో ఈనెల 25న అప్రెంటిషిప్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్‌మైమూన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023, 2024, 2025 విద్యా సంవత్సరంలో పారామెడికల్, నాన్ పారామెడికల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మల్కాజ్‌గిరి డీఐఈఓ కిషన్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్లతో రావాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కుత్బుల్లాపూర్: రీచ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు థైరాయిడ్, బీపీ చెకప్, ఆర్‌బీఎస్ పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా శ్వాసకోశ, ఎముకలకు సంబంధించి సమస్యలతో బాధపడుతున్న 300 మందిని పరీక్షించి మందులు అందజేశారు. శిబిరంలో లయన్, సత్‌జ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం, వైద్యులు నవనీత, రామకృష్ణారెడ్డి, చంద్రకిరణ్, అక్షయ్, మహేశ్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా..

- మూసాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల
- విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ
- 'పది'లో జిల్లాస్థాయి ర్యాంకులు
- వెల్లువలా అడ్మిషన్లు



మూసాపేట: పేరుకు అది ప్రభుత్వ పాఠశాల కానీ కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలతో పాటు పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోనే ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించి ఆదర్శంగా నిలుస్తోంది మూసాపేటలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థినులు కూడా ఈ స్కూల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తుండడంతో అడ్మిషన్లకు ఫుల్ డిమాండ్ నెలకొన్నది.

వెల్లువలా అడ్మిషన్లు..

గత సంవత్సరం 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 800 మంది విద్యార్థినులు చదివారు. టెన్త్ క్లాస్ విద్యార్థినులు 167 మంది చదువు పూర్తి చేసుకుని వెళ్లగా, ఇప్పటికే పాఠశాలలో కొత్తగా 165 మంది విద్యార్థినులు అడ్మిషన్లు పొందగా, ఇంకా చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇదే పాఠశాల ఆవరణలో ఉన్న ప్రైమరీ నుంచి సుమారు 22 మంది 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో గతేడాది కంటే అధికంగా అడ్మిషన్లు అయ్యాయి. ఇంకా విద్యార్థినులను జాయిన్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ..

ప్రతి ఉపాధ్యాయురాలు 10 మంది విద్యార్థినులను దత్తత తీసుకుని వారిని సుశిక్షితులను చేస్తున్నారు. ఉదయం 4 గంటలకే విద్యార్థినులకు కాల్ చేసి నిద్ర లేపి ఉదయం 6 గంటల వరకు చదివిస్తున్నారు. ఈ క్రమంలో ఏమైనా సందేహాలు ఉంటే వాట్సాప్ కాల్‌లో నివృత్తి చేస్తున్నారు. ఏటా ఆగస్టు నుంచి ఉదయం 7 నుంచి 8 గంటల వరకు మ్యాథ్స్ సబ్జెక్టులో వలంటరీ టీచర్‌తో ప్రత్యేక తరగతులు, 8 నుంచి 9 గంటల వరకు పాఠశాల టీచర్లు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలో రెగ్యులర్ తరగతులు. అనంతరం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు. విద్యార్థినులకు కావాల్సిన మోడల్ పేపర్స్ ఇతర సౌకర్యాలను వివిధ ఎన్‌జీఓస్ ద్వారా ప్రధానోపాధ్యాయురాలు చొరవ తీసుకుని అందజేస్తున్నారు.

అందరూ మహిళా ఉపాధ్యాయులే

ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలితో పాటు సుమారు 20 మంది టీచర్లు కూడా మహిళలే. దీంతో విద్యార్థినులకు కూడా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉన్నది.

సంస్థల సహకారం..

క్రిస్టియన్ చారిటి యూనిట్, క్లాప్ ఫౌండేషన్, రాంకీ, ఇతర పలు సంస్థలు ఈ పాఠశాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, మోడల్ పేపర్లు అందించడం, ప్రత్యేక తరగతులకు వలంటీర్ టీచర్, కంప్యూటర్ ల్యాబ్‌కు టీచర్‌ను ఏర్పాటు ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నారు.

అందరి సహకారంతోనే మెరుగైన ఫలితాలు..



ఉపాధ్యాయుల కృషితో పాటు డీఈఓ, ఎంఈఓ, ఎన్‌జీఓ సంస్థల సహాయ సహకారాలతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం. పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోనే మొదటి, రెండో ర్యాంకులు సాధించడంతో పాటు 76 శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యింది. 14 మంది విద్యార్థినులు 500కు పైగా మార్కులు సాధించారు. గతేడాది నుంచి 9వ తరగతి విద్యార్థినులకు సమ్మర్ క్యాంపు కూడా నిర్వహించాం. ఒకేషనల్ కోర్సులైన బ్యూటీషియన్, స్టిచ్చింగ్‌లలో కూడా 9, 10వ తరగతి విద్యార్థినులకు శిక్షణ ఇప్పిస్తున్నాం.

–నాగళ్ల కృష్ణకుమారి, ప్రధానోపాధ్యాయురాలు



పదో తరగతి టాప్ ర్యాంకర్లను సన్మానించిన ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ కుమారి, టీచర్లు (ఫైల్)

ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం

కూకట్‌పల్లి: ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ అధ్యక్షతన కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో ఆదివారం ముఖ్య నేతల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జాతీయ నాయకుడు, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థాగత నిర్మాణానికి పని విభజన చేసుకుని మందకృష్ణ మాదిగ ఆదేశాలు అమలు చేయాలన్నారు. జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాతీయ నాయకులు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశపాగ రాంచందర్ మాదిగ, సీనియర్ నాయకులు డోలక్ నర్సింగ్‌రావు, విద్యార్థి నాయకుడు పవన్, దుర్గరాజు, మోహన్, రమేశ్, బాలాకృష్ణ, రమేశ, మోహిద్, లక్ష్మణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రణయ్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ తదితరులు

వాయుసేన వీరుడికి సన్మానం

కూకట్‌పల్లి: 'ఆపరేషన్ సిందూర్' లో పాల్గొని బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడలోని స్వగృహానికి చేరిన సార్జెంట్ రాపోలు సుఖదేవ్ శరణ్‌ను, కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. ఉగ్రవాదులను ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌కు మన సైనికులు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ పుష్పారెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, పులి శ్రీకాంత్ పటేల్, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సుధాగౌడ్, రవి గౌడ్, మధుమోహన్, హేమంత్, జిల్లా శివ, శేఖర్ గజానంద్, సోను తదితరులు పాల్గొన్నారు.



సార్జెంట్ రాపోలు సుఖదేవ్ శరణ్‌ను సన్మానిస్తున్న డా. సత్యం శ్రీరంగం తదితరులు

కార్మికులు, కూలీలకు బీమా సౌకర్యం కల్పిస్తా



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని భవన, ఇతర కార్మికులు, రోజువారీ కూలీలలకు బీమా కార్డులు అందిస్తామని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు , రోజు వారీ కూలీలతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అందుకే సొంత నిధులతో బీమా సౌకర్యం కల్పిస్తానని సంబంధిత లిస్టును తయారు చేసి ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. ఈ విషయం తెలుసుకున్న క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు కూడా సమావేశానికి హాజరై తమకు కూడా ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించడంతో క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు గోపాల్ నాయక్, వెంకటేశ్, రవి, రాములు, గోపాల్, రాజునాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం జరిగిన కల్యాణోత్సవంలో బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వైష్ణవి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రాకేశ్ కుమార్, కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో ఎమ్మెల్యే వివేకానంద్

పుణ్యక్షేత్రాలకు డీలక్స్ బస్సులు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్ -2 డిపో పరిధిలో తెలంగాణ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలకు ప్రతి శని, ఆదివారాల్లో డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. గూడంగుట్ట సత్యనారాయణస్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండగట్టు హనుమాన్ ఆలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వరిస్వామి ఆలయాలకు డీలక్స్ బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నామని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 5 గంటలకు డిపో నుండి బయల్దేరి రాత్రి 11 గంటలకు మియాపూర్‌కు వస్తాయని తెలిపారు. 30 మందికి పైగా భక్తులు ఉంటే ఏరోజైనా ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. వివరాలకు 9059162162, 9959226420 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

25న శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధి శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.45 కోట్లతో నూతనంగా రోడ్డును విస్తరించనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, నాగిరెడ్డి, మహిపాల్, ప్రసాద్, సందీప్‌రెడ్డి, కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కుత్బుల్లాపూర్: సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి కోరారు. జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రీనగర్, శ్రీరామ్‌నగర్‌లో నెలకొన్న మంజీరా పైపులైన్ లీకేజీ, రోడ్డు సమస్యలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను స్థానిక కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీవాసులు పాపయ్య దొర, సంజీవ్ రెడ్డి, విద్యాసాగర్, రాజు బస, ఆంజనేయులు, నిఖిల్ రాజ్, గంగేశ్వర్ రావు, కిరణ్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

చింతల్: కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలోని దుర్గా మాతా ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా పాల్గొని వ్రతాలు ఆచరించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయగా ఏపీహెచ్‌బీ కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను కలిసిన సభ్యులు



ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్‌తో సభ్యులు

ఆల్విన్‌కాలనీ: జయశంకర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మహేశ్, కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నూతన అసోసియేషన్ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, జయశంకర్‌కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సంకల్ప సభకు తరలిన బీజేపీ శ్రేణులు



మోతీనగర్: 'వికసిత్ భారత్' మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలపొంది ఏడాది పూర్తయిన సందర్భంగా సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో ఆదివారం సంకల్ప సభ నిర్వహించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి బీజేపీ కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు ఠాకూర్, మునగాల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన



శిబిరం నిర్వహించిన డాక్టర్ లక్ష్మీ కమలాకర్‌ను సన్మానిస్తున్న చిన్నారుల తల్లులు



హరిజన బస్తీలో శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ సతీశ్ గౌడ్

కూకట్‌పల్లి: ఆదరణ ఫౌండేషన్ సహకారంతో రాందేవ్ రావువ్ ఆసుపత్రిలో 1–16 ఏళ్లలోపు చిన్నారులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ లక్ష్మీ కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సీఈఓ డాక్టర్ యోబు మాట్లాడుతూ.. వైద్యులు మణికుమార్, దయాకర్, మణి, ప్రశాంతి, ప్రిన్సీ, కల్పన మంతెన, లీలా సృజన పిల్లలకు జనరల్ స్క్రీనింగ్, ఐ చెకప్, రక్త పరీక్షలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ అరగెల రఘునాథ్ బాబు, ఫౌండేషన్ కోశాధికారి భాను వరకుమార్, ప్రధాన కార్యదర్శి పి. మేరీ జోన్స్, ఎ. అనిసా, ఎ. సన్నీ ప్రశాంత్ పాల్గొన్నారు.

అమీర్‌పేట మెడిస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో..

బాలానగర్: అమీర్‌పేట మెడిస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ పరిధిలోని హరిజన బస్తీలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ ప్రారంభించారు. బీపీ, షుగర్, కంటి, మోకాళ్ల, మహిళలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బి. నగేశ్, జనార్దన్ గౌడ్, వైద్యులు వెంకటేశ్వర్లు,సంతోష్, మాధురి, సృజన,షెరాజ్, నాజీమ్, పెంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మోతీనగర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ మరింత సులభం అవుతుందని అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి పేర్కొన్నారు. వివేకానందనగర్ కమ్యూనిటీ హాల్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మధుసూదనారావు, కన్వీనర్ రోణంకి జగన్నాథం, కోశాధికారి గుత్తికొండ రామకృష్ణ, ముఖ్య సలహాదారులు ఈదరాడ సత్యనారాయణ, పిల్లి అశోక్, సీమ షణ్ముకారావు, సుందర శేషారావు, చిలకల సాయన్న తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం, సీఐ వెంకటరెడ్డి తదితరులు

వివేకానందనగర్ సంక్షేమ సంఘం సమావేశం

మోతీనగర్: దశలవారీగా హామీలు నెరవేరుస్తానని వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చేవూరి మధుసూదనారావు అధ్యక్షతన సంఘం సర్వసభ్య సమావేశాన్ని స్థానిక కమిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధే లక్ష్యంగా సంఘం పని చేస్తుందని తెలిపారు. కాలనీలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలను కమిటీ హాల్‌లో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ రోణంకి జగన్నాథం, కోశాధికారి గుత్తికొండ రామకృష్ణ, ముఖ్య సలహాదారులు చిలకల సాయన్న, సుందర శేషారావు, ఇదరాడ సత్యనారాయణ, పిల్లి అశోక్‌కుమార్, సీమ షణ్ముఖరావు, ఎలకుర్తి విజయ్‌కుమార్, గిడుకూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు తదితరులు

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో 56 లబ్ధిదారులకు రూ.21,60,500 విలువైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. గాజులరామారం డివిజన్‌కు చెందిన 9 మందికి రూ.4.30 లక్షలు, రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన 11 మందికి రూ.4.51 లక్షలు, చింతల్ డివిజన్‌కు చెందిన 8 మందికి రూ.2.89 లక్షలు, కుత్బుల్లాపూర్ డివిజన్‌కు చెందిన 6 మందికి రూ.1.60 లక్షల చెక్కులు, జీడిమెట్ల డివిజన్‌కు చెందిన 5 మందికి రూ.1.67 లక్షలు, అదేవిధంగా నిజాంపేట కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.6.62 లక్షల చొప్పున పరిహారం మంజూరైందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో మెరుగైన వైద్యం

సీఎం రిలీఫ్ ఫండ్ పథకంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన వేముల సాయికుమార్‌రెడ్డి (రూ.60 వేలు) కర్ణాక మణి (రూ.34 వేలు), లలిత భాటి(రూ.44వేలు), సుభాద్ర (రూ.60 వేలు), ముత్యాపాగ కవిత (రూ.40వేలు) విలువైన చెక్కులను గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు.